12CTR1:12CTR1.qxd 10/11/2026 11:34 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం
30 వార్త వార్షికోత్సవం
1996 - 2026



### శ్రీ చెంగాళమ్మకు

# పరమేశ్వరి అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 11, ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ మతా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం శ్రీ పరమేశ్వరి అలంకారంతో భక్తులకుదర్శన భాగ్యం కల్పించింది. అలంకారా నికి చెన్నైకి చెందిన శింగన ఓబుల్ రెడ్డి, పద్మజా రెడ్డి దంపతులు ఉభయకర్తగా వ్యవహరించారు. అలాగే అమ్మణ్ణికి ఆనవాయితీగా సమర్పిస్తున్న సారెలలో మొదటి రోజు గొల్లల మొలుగు గ్రామం నుంచి మేళతాళలతో అంగరంగ వైభవంగా భారీ ఊరేగింపులతో భక్తి శ్రద్ధలతో సారెను సమర్పించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ నటరాజ్ డాన్స్ అకాడమీ నాయుడుపేట వారిచే భరతనాట్యం ప్రదర్శన, శ్రీ గుహన్ డాన్స్ అకాడమీ గుమ్మడిపూండి వారిచే నృత్య ప్రదర్శన అలరించాయి. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### ఏర్పాట్లు పర్యవేక్షణకు

# మాఢవీధుల్లో విష్వక్సేనులు



తిరుమల, అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి విష్వక్సేనులు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.

### శ్రీసరస్వతీ దేవి అలంకారంలో

# మరగదాంభిగా దేవి

కాణిపాకం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:




ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠే శ్వరాలయంలో ఆదివారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు మరగదాంభిగా అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొకు ్కలు తీర్చుకున్నారు. ఇదిలా వుండగా సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. తిరిగి రాత్రి అలంకరించిన అమ్మవారిని ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### చిత్తూరు మేయర్ స్థానంపై

# జనసేన ఆశలు

**దక్కకుండా చేయడానికి 'దేశం' నాయకుల ప్రయత్నాలు**

**ఎంపిపి, డివిజన్లు, వార్డు స్థానాల్లో 30 శాతం సీట్లు కేటాయిస్తారని జనసేన, బిజెపి ఆశలు**

**రిజర్వేషన్లు ఖరారైన అనంతరం అభ్యర్థులపై దృష్టి సారించాలని వైకాపా నిర్ణయం**

చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి న్యాయ పరమైన చిక్కులు వీడటం, రాష్ట్ర మంత్రి వర్గం రిజర్వేషన్లు సైతం ఖరారు పూర్తి చేయడంతో జిల్లాలో జడ్పీ ఛైర్మన్, చిత్తూరు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవులు ఏ వర్గాలకు రిజర్వ్ అవుతాయనే విషయంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్లు, మున్సిపాల్టీల్లో వార్డులు, మండల స్థాయిలో ఎంపిపి, జడ్పీటిసీ, ఎంపిటిసీ స్థానాలు, గ్రామ పంచాయతీ స్థాయిలో సర్పంచ్ పదవులు ఏ వర్గాలకు రిజర్వ్ అవుతాయనే ఆసక్తి అందరిలో ఏర్పడింది. మరోవైపు కూటమి పార్టీల పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒక మేయర్ స్థానంను జనసేనకు కేటాయించాలని కూటమి భాగస్వామ పార్టీలకు నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ మేరకు చిత్తూరు మేయర్ స్థానం జనసేనకు దక్కకుండా చేయడానికి అప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ అధిష్టానంతో వారికి వున్న పరిచయాలను ఉపయోగించుకుని ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు మున్సిపల్ డివిజన్లు, వార్డులు, జడ్పీటిసీ, ఎంపిపి, ఎంపిటిసీ, సర్పంచ్ స్థానాల్లో తమకు 30 శాతం సీట్లు కేటాయిస్తారని జనసేన, బిజెపి నాయకులు క్షేత్ర స్థాయిలో భావిస్తు న్నారు. అయితే ఈ స్థానాల్లో కూటమి పార్టీలకు నాయ కత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ఏ మేరకు స్థానాలు కేటాయిస్తుందనే విషయంపై అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్ ఆర్ కాంగ్రెస్ మాత్రం అన్ని పదవులకు రిజర్వేషన్ ఖరారు అయిన అనంతరం ఎన్నికల పోటీ చేసే అభ్యర్థులపై దృష్టి సారించాలని భావించి అధికార తెలుగుదేశం పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిమాణాలను నిశితంగా పరిశీలిస్తుంది. జడ్పీ ఛైర్మన్ రిజర్వేషన్‌కు వస్తే ప్రస్తుతం అమలు అవుతున్న రిజర్వేషన్ల ప్రకారం ఈ సారి జడ్పీ ఛైర్మన్ పదవి ఎస్సీ మహిళలకు రిజర్వ్ కావాల్సి వుంటుంది. అయితే రాష్ట్ర స్థాయిలో కొత్త జిల్లాలు ఏర్పడి 13 వరకు కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కావడంతో జడ్పీ ఛైర్మన్ పదవులకు సంబంధించి రిజర్వేషన్లు రాష్ట్ర స్థాయిలో ఖరారు కానుం డటంతో గతంలో అమలు అయిన రిజర్వేషన్లను ప్రక్కకు పెట్టి కొత్తగా రిజర్వేషన్లు ఖరారు చేస్తే జడ్పీ ఛైర్మన్ పదవి రిజర్వేషన్



సైతం మారే అవకాశం కన్పిస్తుంది. ఈ సారి జడ్పీ ఛైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నిక జరుగనుండటంతో జిల్లాలో బలమైన అభ్యర్థిని జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా నిలపడానికి అధికార తెలుగుదేశం పార్టీతో పాటు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. జడ్పీ ఛైర్మన్ పదవి రిజర్వేషన్ ఖరారు అయిన అనంతరం జడ్పీ ఛైర్మన్ అభ్యర్థి ఎవరనే విషయంపై ఇరు పార్టీల్లో క్లారిటీ రానుంది. అలాగే చిత్తూరు మేయర్ స్థానం చేజిక్కించుకోవడానికి తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత రెండేళ్ళుగా చిత్తూరు మేయర్ స్థానంపై కన్నేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ మేరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో కూటమి పార్టీల సీట్ల సర్దుబాటులో భాగంగా చిత్తూరు మేయర్ స్థానం జనసేన పార్టీకి దక్కనుందని గత నాలుగు రోజులుగా విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. చిత్తూరు మేయర్ స్థానం తెలుగుదేశం పార్టీకి దక్కాలని భావిస్తున్న తెలుగుదేశం నాయకులు ఇక్కడి నుండి జనసేన మేయర్ అభ్యర్థి పోటీ చేయడానికి వీలులేకుండా చేయాలని పార్టీ అధిష్టానంలో తమకు వున్న పరిచయాలను ఉపయోగించుకుని కొంతమంది తెలుగుదేశం నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తిరుపతి నుండి జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటం, ఇప్పుడు అక్కడ మేయర్ స్థానంను జనసేనకు కేటాయించలేమని తెలుగుదేశం పార్టీ సైతం జనసేనకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో బలిజ సామాజిక వర్గ ఓటర్లు పెద్ద స్థాయిలో వున్న చిత్తూరు మేయర్ స్థానంను జనసేనకు కేటాయించాలని కోరడంతో ఈ మేరకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం సైతం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో చిత్తూరు మేయర్ స్థానం కూటమి పార్టీల నుండి ఏ పార్టీకి దక్కుతుందనే విషయం సర్వత్రా ఆసక్తి నెలకొంది. అలాగే కుప్పం, పలమనేరు, నగరి మున్సిపల్ ఛైర్మన్ల రిజర్వేషన్లు ఖరారైన అనంతరం ఇరు పార్టీలు ఇక్కడ ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు కన్పి స్తున్నాయి. ఇక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటిసీలు, ఎంపిపిలు, ఎంపిటిసీలు, సర్పంచ్ స్థానాల్లో తమకు 30 శాతం సీట్లు కేటా యిస్తారని కూటమి భాగస్వామ్య పార్టీల్లో భాగంగా వున్న జనసేన, బిజెపిలు భావిస్తున్నాయి. రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం జనసేన, బిజెపి పార్టీలకు తెలుగుదేశం పార్టీ ఆశించిన సీట్లు కేటాయించలేదని, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో సీట్లు కేటాయిస్తామని అప్పట్లో తెలుగుదేశం అధిష్టానం హామీ ఇచ్చిందని ఆ హామీ మేరకు ప్రస్తుతం జనసేన, బిజెపిలకు ఆశించిన స్థాయిలో సీట్లు కేటాయిస్తారని ఆ పార్టీల నాయకులు ఆశిస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ మాత్రం బలం వున్న చోట్ల జనసేన, బిజెపి పార్టీలకు సీట్లు కేటాయిస్తామని, బలం లేని చోట సీట్లు కేటాయిస్తే ప్రతిపక్ష పార్టీ వైకాపాకు లబ్ధి చేకూరుతుందని వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటిసీలు, ఎంపిపిలు, ఎంపిటిసీలు, సర్పంచ్ స్థానాల్లో జనసేన, బిజెపి పార్టీలకు ఎన్ని శాతం సీట్లు దక్కుతాయనే విషయంపై అటు జనసేన, బిజెపి నేతలతో పాటు ప్రజల్లో సైతం ఆసక్తి నెలకొంది. మరోవైపు ప్రతిపక్ష వైకాపా సైతం జడ్పీ ఛైర్మన్, మున్సిపల్ మేయర్, ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ల ఖరారుపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ పరిస్థితుల్లో జడ్పీ ఛైర్మన్, మున్సిపల్ మేయర్, ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లు రాష్ట్ర స్థాయిలో ఖరారు అయితే ఆపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటసీలు, ఎంపిపిలు, ఎంపిటిసీలు, సర్పంచ్ పదవుల రిజర్వేషన్లు జిల్లా స్థాయిలో ఖరారు చేయడంలో అధికారులు నిమగ్నం అయ్యారు.

## బాలత్రిపుర సుందరీ దేవిగా గంగమ్మతల్లి

తిరుపతి, అక్టోబర్ 11ప్రభాతవార్త:

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, ప్రత్యేక అభిషేకము, హోమం కుంకుమార్చన కార్యక్రమములు నిర్వహించారు. శాప్ చైర్మన్ రవినాయుడు దంపతులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు నిర్వహించిన ఊంజల్‌సేవలో గంగమ్మ బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 27 మంది ఉభయదాతలు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ , ఈఓ ఎ. జయకుమార్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.





# తిరుపతి మేయర్‌పై బిజెపి చూపు!

**-కూటమిలో మేయర్ పీఠంపై ఆసక్తికర చర్చ**





ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి మేయర్ పీఠంపై బిజెపి నాయకులు కన్నేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి మేయర్ స్థానాలను తమకు కేటాయించాలని ఆ పార్టీ కోరుతున్నట్లు సమాచారం. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకపోయినా, తిరుపతి మేయర్ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించే అవకాశాలున్నాయన్న అంచనాలతో వివిధ పార్టీల నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని మేయర్ అభ్యర్థిగా బరిలోకి దించాలని కూటమిలోని ఒక వర్గం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మద్దతు ఉన్నట్లు చెబుతున్న పి.నవీన్ కుమార్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆశీస్సులతో టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డికి అవకాశం కల్పించవచ్చనే చర్చ కూడా సాగుతోంది. అయితే, తిరుపతిలో బిజెపికి స్వతంత్రంగా బలమైన స్థానిక రాజకీయ పునాది లేదని, ఆ పార్టీకి మేయర్ టికెట్ కేటాయిస్తే కూటమి విజయావకాశాలు దెబ్బతినవచ్చని టిడిపిలోని ఒక వర్గం అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఏడు స్థానాల్లో కలిపి కూటమికి 1,91,888 ఓట్ల ఆధిక్యం లభించింది. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మద్దిల గురుమూర్తి, బిజెపి అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుపై 14,569 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ తిరుపతిలో బిజెపికి మేయర్ స్థానం కేటాయించే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని టిడిపి నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**-టిడిపి ఆశావహులు వీరే!:**

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేయాలనే ప్రతిపాదనకు అనుగుణంగా టిడిపి మబ్బు దేవనారాయణ రెడ్డి పేరును పరిశీలించాలని ఒక వర్గం సూచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి కుమారుడు, అంతర్జాతీయ అనుభవం కలిగిన యువ విద్యావంతుడు డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డికి అవకాశం కల్పించాలని కొందరు ప్రతిపాది స్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి మేయర్ స్థానం బిసిలకు రిజర్వ్ అయితే తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో యాదవ సామాజిక వర్గం నాయకులు జి. నరసింహ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, అన్నా అనితా యాదవ్, పుష్పా యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జనరల్ కేటగిరీకి కేటాయించినా పార్టీ కోసం పనిచేసిన తమకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నట్లు సమాచారం.

**జనసేన కూడా మేయర్ పీఠంపై ఆశలు:**

తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో, మేయర్ పదవిని కూడా తమ పార్టీకే ఇవ్వాలని జనసేన నాయకులు కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అవకాశం కల్పిస్తే కొత్త అభ్యర్థిని రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు తమ నాయకత్వానికి తెలిపినట్లు సమాచారం. అయితే, స్థానికంగా పార్టీకి ఉన్న బలం, నాయకుల మధ్య సమన్వయం, సామాజిక సమీకరణాలు, ఎన్నికల విజయావకాశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మేయర్ అభ్యర్థిని నిర్ణయించాలని టిడిపిలోని ఒక వర్గం సూచిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుపతి మేయర్ పీఠం కూటమిలోని ఏ పార్టీకి దక్కుతుంది? ఏ సామాజిక వర్గానికి అవకాశం లభిస్తుంది? స్థానికంగా బలమున్న నాయకుడికి ప్రాధాన్యం ఇస్తారా? యువ విద్యావంతుడికి అవకాశం కల్పిస్తారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# రిజర్వేషన్లపై ఉత్కంఠత

### మొదటి విడతలో మున్సిపాలిటి లేనట్లే! ఆశావహుల్లో ఆశలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త





శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల పోరు ఉత్కంఠత చోటు చేసుకుంది. అయితే రిజర్వేషన్లు ఖరారు కాకపోవటంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రెండున్నర సంవత్సరాల తరువాత జరిగే ఎన్నికలకు సంబంధించి ఆశావహుల్లో అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే మున్సిపాలిటికి మొదటి విడతలో ఎన్నికలు లేనట్లే అని తేలింది. ఇప్పటి వరకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కాలేదు. కాగా శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని జనాభాను రాష్ట్ర అధికారులు తీసుకున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియను క మిషనర్ కెవి కృష్ణారెడ్డి తన సిబ్బందితో పరుగులు తీయిస్తున్నారు. డీలిమిటేషన్ కార్యక్రమాల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న 35 వార్డుల స్థానంలో 44 వార్డులు రావాలి. ఈ నేపథ్యంలో కమిషనర్ చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాట్లు చేస్తున్నారు. డీలిమిటేషన్‌లో భాగంగా పరిసరాల్లోని ఊరందూరు, టిఎంవి కండ్రిగ, నారాయణ పురం, దొమ్మరమిట్ట, ఎల్ఐసి కాలనీ పరిసరాలను కలుపుతూ ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎన్నికల రిజర్వేషన్లపై ఉత్కంఠత**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మున్సిపాలిటిలో 44వార్డులంటే సుమారు 15 వార్డులకు పైగా బిసిలకు కేటాయించారు. ఇక ప్రతిపక్షంలో ఒకే పార్టీ ఉండగా కూటమిలో మూడు పార్టీలు పంచుకోవాలి. జనసేన, బిజెపిలకు వార్డులు కకేటాయించాలి. అలాగే మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలి. ఇలా రక రకాల రిజర్వేషన్లు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికపై సాగుతుంది. అయితే అధికార పార్టీ నాయకుడు మాత్రం బిసి అయితే తన ముఖ్యఅనుచరుని పేరును, అలాగే ఓసి అయితే మరో నాయకుని పేర్లను తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జికి అందించినట్లు సమాచారం. ఇక ప్రతిపక్ష పార్టీలో కూడా జనరల్, ఎస్‌సి అయితే ఎవరో ఒకొలిక్కి వచ్చినట్లు చర్చించుకుంటున్నారు. కానీ అధికార పక్షం నాయకుడు ౦రెండు వర్గాల పేర్లే ఇచ్చారనేప్రచారంతో ఈ రెండింటిలోనే 'రిజర్వేషన్' ఉంటుందని భావి స్తున్నారు. ఇక మండలాలల్లో ఇప్పటికే అధికారులు జనాభా ఏ ఏ కులం ఎంత మంది అనే వివరాలను జిల్లా అధికారులకు అందించినట్లు సమాచారం. సోమవారం ఎన్నికల రిజర్వేషన్లు ప్రకటించనుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. ఇప్పటికే పదవులపై ఆశలు పెంచుకున్న నాయకులు ఈ సారి తమకు దక్కుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ అన్ని మండలాల్లో పట్టు అవగాహన ఉంది. మరి నాలుగు మండలాల్లో ఏ ఏ మండలం ఎవరికి దక్కుతుందో? జనసేన, బిజెపిలకు కనీసం ఒక్కక్క మండలం కేటాయిం చాల్సి వస్తుందేమో? అలాగే వార్డులు, ఎంపిటిసి స్థానాలు రిజర్వేషన్లు ఖరారు అయిన తరువాత తేల్చాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అధికార పార్టీ కి ఓ అవగాహన వచ్చినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. అన్ని స్థానాలు గెల్చుకుంటామనే దీమాలో ఉన్నారు.

**కలసికట్టుగా పని చేస్తారా?**

ప్రతిపక్షం మాటేలా ఉన్నా అధికార పక్షంలో సీట్లు పంచుకునే రాజకీయ పార్టీలు విజయానికి కలసి కట్టుగా పని చేసుకుంటారా? అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏ కార్యక్రమాల్లో కూడా కలసి కట్టుగా ముందుకు సాగుతున్న దాఖలాల్లేదు. ముఖ్యంగా ఇప్పటి వరకుజరిగే ప్రభుత్వ కార్యాక్రమాల్లో ఒక్క శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మెన్ మినహా పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు పాల్గొంటున్న సందర్భాల్లేదు. మరి ఎన్నికల్లో ఒకటిగా పని చేస్తారా? ఒకరి కోసం ఒకరు పట్టుదలగా పని చేస్తారా? అనేది నేడు పరిశీలకుల్లో చర్చనీంశంగా మారింది. మూడు పార్టీ కార్యకర్తలతో నాయకులు సమావేశం జరిపిన సందర్భాల్లేదు. ఎవరికి వారు విజయం సాధించాలని తమ పార్టీని బలోపేతం చేసుకోవాలని పిలుపు నిస్తున్నారు. సర్దుబాటుల్లో ఒక పార్టీకి అవకాశం వస్తే ముగ్గురు కలసి పని చేసుకుంటారా? అని పరిశీలకులు అనుమానిస్తున్నారు. ఇలాగే ఎవరికి వారైతే ఫలితాలు ఎలా ఉంటాయో అని చర్చించుకకుంటున్నారు.

12 CTR 2:12 CTR 2.qxd 10/11/2026 11:38 PM Page 1



# సరికొత్త రికార్డు దిశగా మున్సిపాలిటీ అభివృద్ధి

- మునుపెన్నడు లేని విధంగా భారీగా నిధులు
- పట్టణ సమగ్ర అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనే లక్ష్యం
- మీ ఎమ్మెల్యే మీ వద్దకు పర్యటనలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు రూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త**

పలమనేరు మున్సిపాలిటీ సరికొత్త రికార్డు దిశగా అభివృద్ధి జరుగుతున్నదని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలో మీ ఎమ్మెల్యే మీ వద్దకు అనే కార్యక్రమంలో భాగంగా 1,2,3,4,32,34,35 వార్డుల పరిధిలో ఆదివారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజి, విద్యుత్ లైన్ల మార్పు, పారిశుధ్యం అంశాలలో ప్రజల నుంచి ఆయనకు వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు పట్టణ సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. దాదాపు 75 కోట్ల వ్యయంతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ ఇతర మోలిక వసతుల పనులకు అనుమతులు వచ్చాయని తెలిపారు. ఇందులో అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ కింద రాబోయే రోజుల్లో మిగిలిన డ్రైనేజ్, రోడ్ల పనులను వేగవంతం చేయనున్నామన్నారు. తాగునీటి వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా గతంలో వేసిన పాత పైప్‌లైన్ల సమస్యను పరిష్కరించేందుకు, కొత్త పైప్‌లైన్ల మార్పిడికి రూ.12.50 కోట్లు మంజూరైందని, అందులో రూ.2.20 కోట్లతో పెద్ద చెరువు సుందరీకరణ (బ్యూటిఫికేషన్) పనులు చేపట్టనున్నామని తెలిపారు. పెద్ద చెరువు కలుషితం కాకుండా మురుగునీటిని శుద్ధి చేసేందుకు రూ. 18.5 కోట్లతో పనులు ప్రారంభం చేయనున్నామని శుద్ధి చేసిన నీటిని వ్యవసాయం, ఇతర అవసరాలకు ఉపయోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఇక శాశ్వత తాగునీటి పరిష్కారం కొరకు కౌండిన్య రిజర్వాయర్‌తో పాటు వాటర్ గ్రిడ్ ద్వారా పట్టణ ప్రజలకు నిరంతరం 24 గంటల తాగునీరు అందించేలా ప్రణాళికలు చేశామన్నారు. ప్రతి వాడలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నామని పేర్కొన్నారు. గంటావూరు కాలనీ, గద్దూరు, కాలనీలతో పాటు కొత్తగా విస్తరణ జరిగిన అన్ని ప్రాంతాల్లో రాబోయే 6 నెలల నుంచి ఏడాదిలోపు 100 శాతం రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్బీసీ కుట్టీ, గిరిబాబు, ఖాజా, నాగరాజు, క్రిష్ణ మూర్తి గౌడ్, మాబాషా, కోటేశ్వర్, మదన్, శ్రీధర్, బీఆర్సీ కుమార్, జావీద్, యువరాజ్, అంజద్, మురళీ మోహన్, సాధిక్, జనసేన నాయకులు దిలీప్, పూల చైతు, నాగరాజు, మురాదు తదితరులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయాలి - ఎమ్మెల్సీ భరత్



**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల గెలుపుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అడవిబూదుగూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమాలతోపాటు కూటమి ప్రభుత్వం వైఫల్యాలు ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. అన్ని పంచాయతీల్లోను పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టడం జరుగుతుందన్నారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 11కుటుంబాలు వైకాపాలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, వన్నియకులక్షత్రియ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ఎం శ్రీను, నాయకులు రమేష్, ఈశ్వర్, అన్నాదొరై, రమేష్, ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**శాంతిపురం,అక్టోబర్ 11 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాలతో మండలంలో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం గ్రామాల్లో నేతలు పంపిణీ చేశారు. నంజంపేటలో చంద్రమ్మకు 42664, శాంతంపల్లిలో కార్యకర్త మునిరత్నం కుటుంబానికి 5లక్షల చెక్కుఅందించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రాజేంద్ర, వెంకటేష్, కోదండప్ప, బాబు, బద్రి, మునెప్ప, మంజునాథ్, పిఎసిఎస్ డైరెక్టర్ దాము, మధు, శ్రీరాములు, ఆనందరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు. అలాగే తుమ్మిశిరోడ్డులో రాఘవేంద్రకు రూ68234ల చెక్కును అందించారు. కార్యక్రమంలో యూనిట్ఇన్‌చార్జ్‌రాజేంద్ర,నేతలుమంజునాథ్‌గౌడు,కోదండప్ప, వెంకటేష్,బాబు,మునియప్ప పాల్గొన్నారు.

## సీసీఆర్టీ శిక్షణ పూర్తి చేసిన ఇంగ్లీష్ టీచర్ శ్రీకాంతి



**చిట్వేలి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయు రాలిగా పనిచేస్తున్న శ్రీకాంతి, రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వ హించిన 519 వ ఓరియంటేషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. భారత ప్రభుత్వ సాంస్కృ తిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 8 వరకు ఈ శిక్షణ కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న ఆమె భారతీయ సంస్క ృతి, కళలు, సంప్రదాయాలు, వారసత్వ సంపదతో పాటు చిత్రలేఖనం, నాటకరంగం, కథాకథనం, వస్త్రకళలు తదితర సృజనాత్మక కళల్లో శిక్షణ పొందారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించి, భారతీయ సంస్క ృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన శ్రీకాంతిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు

## ఆ ఇద్దరు నాయకుల మధ్య సఖ్యత కుదిరేనా

**రైల్వే కోడూరు రూరల్ అక్టోబర్ 11( ప్రభాతవార్త )::** రైల్వే కోడూరు మండలంలో ఆదివారం ఒక అధికార పార్టీకి చెందిన టిడిపి నాయకులు ఏకాంతంగా రహస్యంగా చర్చలు చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సఖ్యత కుదిరిందా లేక కుదరలేదా అనే కోణంలో స్థానిక రైల్వేకోడూరు ప్రజల మనోభావాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా దాదాపు గంటపాటు జరిగిన ఈ రహస్యమైన చర్చలు ఏ విధంగా ఉంటాయోన్న ఆందోళన అధికార పార్టీ నేతల్లో ఉంది. ముఖ్యంగా సర్పంచి మాజీ నాయకులకు ఇస్తే మండలాన్ని అధికార పార్టీకి చెందిన ఇన్చార్జికే బాధ్యతలు ఇస్తారనే ఊహాగానాలు చర్చలు జరిగినట్లు కొంతమంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయబావుట సాధించకపోతే ఇరువురికి అధిష్టానం నుండి అక్షింతలు పడే అవకాశం కూడా మెండుగా ఉన్నాయని కూడా కొంతమంది బహిరంగంగా చర్చించుకుం టున్నారు. ఈ దఫా ఎన్నికలలో అధికార పార్టీకి చెందిన టిడిపి నాయకులు ఐదు మండలాలలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా చేపట్టి అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలనే ఊహల్లో ఉండగా, అదేవిధంగా ప్రతిపక్షంలో ఉన్న వైసిపి రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎన్ని స్థానాలను గెలుచుకుంటుందో సంబంధిత ఇన్చార్జి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అతనిపైన ఉన్న అసమతి ఏ రూపం దాలుస్తోందో అనిన కొంతమంది దిగువ స్థాయి వైసిపి శ్రేణులు ఏ విధంగా ఉండాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. గత రెండు రోజుల క్రితం రాజంపేటకు చెందిన పార్లమెంట్ సభ్యులతో కొంతమంది వైసిపి నాయకులు బహిరంగంగానే ఎంపి వద్ద చర్చలు కొనసాగగా కొంతమంది సంబంధిత ఇన్చార్జిపై నమ్మకం లేని మాటలను ఎంపి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ రానన్న స్థానిక సంస్థలఎన్నికలలోరైల్వే కోడూరు నియోజకవర్గం ఎన్నికలలో ఏ విధంగా జరుగుతుందో వేచిచూడాల్సిందే.

## 73వ సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీల ఎంపిక

**రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త::** అన్నమయ్య జిల్లా జట్టులో 73వ సీనియర్ పురుషులు మరియు మహిళల కబడ్డీ పోటీలకు ఎంపికలను 14న కాకతీయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి అరుణ రెడ్డి తెలియజేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎంపికలో ఆసక్తిగల క్రీడాకారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ ఎంపికలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు 73వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషుల మరియు మహిళలు కబడ్డీ పోటీలలో పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అన్నమయ్య జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 18,19,20,21 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బసవ పున్నయ్య స్టేడియం అజిత్ నగర్‌లో పురుషులకు, మహిళలకు నిర్వహించనున్నట్లు ఆంధ్ర కబడి అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వంతోనే బిసిలకు గుర్తింపు : దేశం నేతలు

**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే బిసిలకు తగు గుర్తింపు లభించిందని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి ఛైర్మన్ జిఎంరాజు, రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగిన బిసి సామాజికవర్గీయుల సమావేశంలో వారు మాట్లాడారు. జయహోబిసి అనేది కూటమి ప్రభుత్వం విధానం అన్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి బిసిలు పార్టీ వెన్నంటే ఉన్నారన్నారు. కూటమికి వేసిన 57శాతం ఓట్లలో బిసిలది కీలకపాత్ర అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు బిసిల రిజర్వేషన్లు 34శాతం చేసి ప్రోత్సహిస్తు న్నారన్నారు. బిసిలకు అన్యాయం చేయాలని మాజీ సిఎం వైఎస్ జగన్ చూస్తున్నారన్నారు. బిసిలకు న్యాయం చేయాలంటే మనసు ఆయనకు రాదని పేర్కొన్నారు. టిడిపిది బిసిలది రాజకీయ బంధం కాదని అన్నదమ్ముల బంధం అన్నారు. తెదేపా డిఎన్ఎలోనే బిసిలకు రాజ్యాధికారం, న్యాయం, సాధికారత ఉన్నాయన్నారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 34శాతంకుపైగా సీట్లు ఇస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు,కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

కుప్పం మున్సిపల్ పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలు ఎదురొ ్కంటున్న సుమారు 32మందికి ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్)చెక్కులను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు పంపిణీ చేశారు. రూ 22.77లక్షల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి కృష్ణన్, యువనేత హర్షధర్మతేజ,స్థానిక నేతలు పాల్గొన్నారు.

## హార్టీకల్చర్‌పై గ్రామాల్లో కళాజాత బృందం ప్రచారం

**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌పై ప్రభుత్వం ఆదేశాలతో కుప్పం మండలంలోని గ్రామాల్లో కళాజాత బృందం ప్రజలకు అవగాహన, విస్త ృత ప్రచారం చేపడుతోంది. శనివారం రాత్రి మండలంలోని కొత్తి_ండ్లు, చందం గ్రామాల్లో కళాజాత బృందం రాయలసీమలో కూటమి ప్రభుత్వం చేపట్టే హార్టీకల్చర్ హబ్ ఏర్పాటు తద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలకు వివరిస్తున్నారు. గ్రామాల్లో రైతులు, మహిళలు ఈకార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## వైకాపాలో చేరిన గుడుపల్లె మండల యువకులు

**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



గుడుపల్లె మండలం పిబి వాడ పంచాయతీ పాపానూరు, కమ్మగుట్టపల్లి, చిన్నగొల్లపల్లి పంచాయతీ పెద్దగొల్లపల్లి గ్రామాలకు చెందిన 28మంది యువకులు ఆదివారం ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ కెఆర్‌జె భరత్ సమక్షంలో వైకాపాలో చేరారు. ఈసందర్భంగా వారిని పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్సీ భరత్‌ఆహ్వానించారు. కార్యక్రమంలో గుడుపల్లె మండల కన్వీనర్ రామకృష్ణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కడ పిడి వికాస్ మర్మత్



**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

కుప్పం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి సమస్యలపై నేరుగా వినతి పత్రాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## వినాయక నిమజ్జనంలో యాదమరి పోలీసులపై దాడి

**చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

యాదమరి మండలం పెరియంబాడి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా కొంతమంది అక్కడికి వెళ్ళిన పోలీసులపై దాడి చేశారు. ఈ మేరకు యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెరియంబాడి గ్రామంలో వినాయకచవితి సందర్భంగా వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే ఈ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి పోలీసుల నుండి ఎవ్వరు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఈ క్రమంలో నిర్వాహకులు ఆదివారం వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజెలు ఏర్పాటు చేసి నృత్యాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ వర్గానికి చెందిన కొందరు వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహిస్తున్న డిజె, ఇతర కార్యక్రమాలతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెరియంబాడి గ్రామంకు చేరుకున్న పోలీసులు వినాయక నిమజ్జన ఊరేగింపులో నిర్వహిస్తున్న డిజెలను నిలుపుదల చేయాలని కోరగా, ఈ విషయంపై స్థానికులు, పోలీసుల మధ్య మాట మాట పెరగడంతో కొంతమంది పోలీసులపై దాడి చేశారు. పోలీసులపై దాడి జరుగడంతో సమాచారం తెలుసుకున్న చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌తో పాటు సర్కిల్ పరిధిలోని పోలీసులు అందరు పెరియంబాడి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులపై దాడి చేసిన వారిని గుర్తించడానికి ఉపక్రమించారు.

## దేవీ శరన్నవరాత్రుల పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**చిత్తూరురూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం దేవీ శరన్నవరాత్రుల ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఉదయం గిరింపేటలోని శ్రీ దుర్గమ్మ దేవస్థానానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించిననంతరం హోమంలో పాల్గొన్నారు. అలాగే కొంగారెడ్డిపల్లె శాంతినగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షుడు వరుణ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబురావు, కమిటీ సభ్యులు, నాయకులు వరలక్ష్మీ, పచ్చయప్ప, ఈశ్వరరావు, శంకర్, యువరాజులనాయుడు, చిట్టిబాబు, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్

**చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని ఎస్పీ తెలిపారు.

## గ్రామంకు బస్సు తెచ్చిన గుడుపల్లి ఎస్ఐ

- పోలీసు పల్లెనిద్ర కార్యక్రమంలో వచ్చిన వినతులపై చర్యలు

**చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

పోలీసులు శాంతిభద్రతల విషయంలోనే కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సైతం ముందుంటారని గుడుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు నిరూపించారు. గుడుపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో గుడుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు పోలీసులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో తమ గ్రామంకు ఆర్టీసీ బస్సు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్ళడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, నిర్ణీత సమయానికి రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో తమ దైనందిత కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందని ఎస్ఐ శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. పోలీసులకు సబంధించిన విషయం కాకపోయినప్పటికీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపాలని ఎస్ఐ శ్రీనివాసులు భావించారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆర్టీసీ అధికారులతో చర్చించి వెంకటాపురం గ్రామంకు ప్రతిరోజు ఆర్టీసీ బస్సు తిరిగేఆ చర్యలు తీసుకున్నారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో ఎస్ఐ శ్రీనివాసులు చొరవతోనే గ్రామంకు ఆర్టీసీ వచ్చిందని భావించిన ప్రజలు ఎస్ఐ శ్రీనివాసులును అభినందించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై సమస్యలపై తమ వినతులను అందజేస్తే వాటిని జిల్లా అధికారులు పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## స్థానిక ఎన్నికల్లో తెదేపా సత్తా చాటాలి

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత ్నం



**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్వరలో జరిగే పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా ఏంటో చాటాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం తమిళనాడు సరిహద్దు గ్రామాలైన బ్రహ్మదేవరచేన్లు, దేవరాజపురం గ్రామాల్లో జరిగిన తెదేపా సమన్వయ కమిటీ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మారుమూల సరిహద్దు గ్రామాలకు సైతం నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ సాధించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి మండల అధ్ యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం,క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కార్పోరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి,పార్థసారథి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు విభూషణ్, గాయత్రి, ఈశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



మండలంలోని కొటాలూరు పంచాయతీ మాజీ సర్పంచ్ సామన్న కుటుంబీ కులను ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పరామర్శించారు. సామన్న భార్య మృతి చెందడంతో ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర ్పంచులు రాజేంద్ర, సంజీవి, డాక్టర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

12 CTR 3:12 CTR 3.qxd 10/11/2026 11:41 PM Page 1



## డిగ్రీతో ఆగిపోకండి.. నైపుణ్యం పెంచుకోండి

**గేట్ ఇన్‌స్టిట్యూట్ ఫ్రెషర్స్ డేలో చైర్మన్ తమ్మినేని పిలుపు**

**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



కళాశాల విద్య అంటే కేవలం డిగ్రీ సాధించడమే కాదని, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే నైపుణ్యం పెంపొందించుకోవడమని గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ చైర్మన్ డా. తమ్మినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తిరుపతిలోని కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే-2026 వేడుకల్లో ఆయన నూతన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలి. తమ సామర్థ్యంపై నమ్మకం ఉంచి, కష్టపడి పనిచేయాలి. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి. మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉంది అని ఆయన సూచించారు. విద్యతో పాటు మంచి నడవడిక, నాయకత్వ లక్షణాలు, సంభాషణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు, అధ్యాపకులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానం, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల కృషి చేస్తుందని పేర్కొన్నారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నూతన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు తోటి విద్యార్థులు, అధ్యాపకులతో పరిచయాలు పెంచుకున్నారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిన ఈ కార్యక్రమం ఆనందంగా ముగిసింది.

## వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ భరోసా

**ఐదుగురు లబ్ధిదారులకు రూ.14.40 లక్షల మేర చెక్కులు**



**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం ఉదయం తన కార్యాలయంలో ఐదుగురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పత్రాలను అందజేశారు. బైరాగిపట్టెడకు చెందిన కన్నయ్య నాయుడుకు రూ.2.57 లక్షలు, ఎల్బీ నగర్‌కు చెందిన సురేంద్రబాబుకు రూ.2.42 లక్షలు, రేణిగుంట రోడ్డుకు చెందిన సుబ్బరామయ్యకు రూ.1.92 లక్షలు, జీవకోనకు చెందిన మానసకు రూ.2.49 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బైరాగిపట్టెడకు చెందిన శ్రీనివాస్‌కు లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.5 లక్షల పత్రాన్ని అందజేశారు. ఈ ఐదుగురికి కలిపి రూ.14.40 లక్షల మేర ఆర్థిక సహాయం అందింది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు చికిత్స ఖర్చుల భారం తగ్గించడంలో సీఎంఆర్ఎఫ్ సహాయం తోడ్పడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, శెట్టిపల్లి రామకృష్ణ, చరణ్, రాజేష్ ఆచారి, లచ్చి రాయల్, టీడీపీ నాయకుడు దేవెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి చూపే మనిషికి వెలకట్టలేని వరం




**రేణిగుంట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:**

మనిషి శరీరంలోని అన్ని ఇంద్రియాల్లో కంటికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచాన్ని చూడటానికి, ప్రకృతిని ఆస్వాదించడానికి, రోజువారీ పనులను స్వతంత్రంగా చేసుకోవడానికి చూపు ఎంతో అవసరం. అలాంటి అమూల్యమైన కంటి చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్యం చేయించుకోవాలని జూలియన్ రాజు అన్నారు. రేణిగుంట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్, తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఈ శిబిరం నిర్వహించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పలువురు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్యులు కళ్లను పరీక్షి ంచి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ అధ్యక్షుడు జూలియన్ రాజు మాట్లాడుతూ, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించేందుకు వెంటనే ముందుకొచ్చిన తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శిబిరానికి అనుమతులు మంజూరు చేసిన ఎంపీడీవోతో పాటు సహకరించిన ఇతర అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సభ్యులంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర, కోశాధికారి కోటేశ్వరరావు, సభ్యులు గంగారి రమేష్, ప్రభాకర్, నవీన్, నరేష్, అరుణ్ పాండ్యన్, అనిల్, ప్రభు, మురళి , లోకనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పాతపాళెంలో ఆపరేషన్ త్రిశూల్‌పై అవగాహన

**కేవీబీపురం, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలంలోని పాతపాళెంలో ఎస్ఐ ఓబయ్య ఆదివారం రాత్రి గ్రామంలోని యువకులకు, ప్రజలకు ఆపరేషన్ త్రిశూల్‌పై అవగాహన కల్పించారు. యువకులు గంజాయి వాడకం నిషేధించాలన్నారు. గంజాయికి బానిసలు అయితే బతుకులు పాడవుతాయని తెలిపారు. యువకులు విలాసాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పాకాలలో మెగా హెల్త్ క్యాంపు

**పాకాల ప్రభాతవార్త అక్టోబర్ 11**



లైన్స్ క్లబ్ ఆఫ్ పాకాల ప్లాటినం మరియు హోప్ హాస్పిటల్, చిత్తూరు వారి సహకారంతో ఆదివారం రోజున స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పాకాలలో డా. హరీష్ ఆర్థోసర్జన్, డా. దేవేంద్ర నాయుడు (జనరల్ ఫిజీషియన్), డా. బిందు పియాంక (జనరల్ మెడిసిన్) మరియు సీఈఓ హేమంత్ కుమార్ బృందం పాల్గొన్నారు. దాదాపు 175 మందికి ఉచిత వైద్య సేవలు, ఉచిత మందులు అందించారు. 108 మందికి షుగర్ పరీక్షలు, 106 మందికి బోన్ డెన్సిటీ పరీక్షలు, 140 మందికి యూరిక్ యాసిడ్ పరీక్షలు, 130 మందికి నర్వ్ కండక్షన్ పరీక్షలు ఉచితంగా చేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు లైన్ జి. గురుస్వామి నాయుడు, కార్యదర్శి చంగల్ రాయ నాయుడు, కోశాధికారి ఎం. కుప్పు స్వామి నాయుడు, సభ్యులు జి. రామయ్య, రేవి తులసి రామన్, ఆరు దొరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**నారాయణవనం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :**





మొదటి రోజుల అమ్మవార్లు బాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అరణ్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాథకోనలో వెలసిన కామాక్షాంభిగా అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆదివారం ఉదయం బాలత్రిపురసుందరి అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే భక్తిశ్రద్ధలతో జలపాతంలో స్నానం చేశారు. అలాగే తిరువట్యంలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు బాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం బాలత్రిపురసుందరి అలంకరణలో ఊంజల్‌సేవ నిర్వహించారు. నారాయణవనంలో ద్రౌపతీదేవి అమ్మవారు సైతం బాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు.

## సముదాయంలో తాగునీటి పైప్‌లైన్ లీక్

**పట్టించుకోని అధికారులు..!**



**నారాయణవనం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :**

మండలంలోని సముదాయం గ్రామ ప్రజలకు అందించే తాగునీటి పైప్‌లైన్ లీక్ కావడంతో నీరంతా వృధాగా పారుతున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలకు ప్రధానంగా ఎగువ బొబ్బరాజుపాలెంకు వెళ్లే మార్గంలో వేసిన భోరు ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. అయితే పైప్‌లైన్ అరుణానది బ్రిడ్జి వద్ద విరిగిపోవడంతో తాగునీరంతా వృధాగా పారుతూ నదిలో కలిసిపోతున్నది. అంతేకాకుండా పగిలిన పైప్‌లైన్ నీరు రోడ్డుపై ప్రవహించడంతో పాదచారులకు ఇబ్బంది మారుతున్నది. పైప్‌లైన్ లీక్‌తో గ్రామంలోకి కావాల్సిన నీరు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే లీకేజీ మరమ్మతు పనిని చేపట్టి నీటి వృధాను అరికట్టాలని కోరుతున్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ యూజీ ప్రవేశాలకు రెండ్రోజులే గడువు

**ఈ నెల 13తో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ**

**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



సంప్రదాయ కళాశాలలకు వెళ్లే అవకాశం లేని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అందుబాటులో ఉన్న ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు గడువు సమీపిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13 చివరి తేదీగా నిర్ణయించినట్లు తిరుపతిలోని ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలో ఉన్న ప్రాంతీయ కేంద్రం కోఆర్డినేటర్ డా. ఎం. కిరణ్ కుమార్ రాజు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి, ట్యూషన్ ఫీజును కూడా చెల్లించాలని సూచించారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఫీజు విజయవంతంగా చెల్లించిన విద్యార్థులు తమ యూనివర్సిటీ ఖాతాల్లోకి ప్రవేశించి గుర్తింపు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశాల నమోదు, ఫీజు చెల్లింపు తదితర అంశాలపై సందేహాలుంటే 9963640650, 7382929617, 08772249607 నంబర్లలో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోని వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## సైనిక్ స్కూల్ ర్యాంకుల్లో విశ్వం ముద్ర

**ఏపీ,తెలంగాణల్లో ప్రథమ ర్యాంకులు.. నవోదయలో 72 సీట్లు**

**తిరుపతి విద్య అక్టోబర్ 11 ప్రభాత వార్త**



జాతీయ స్థాయి పాఠశాలల్లో ప్రవేశాల కోసం జరిగే పోటీలో విశ్వం విద్యార్థులు మెరిశారు. 2026 సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించడంతో పాటు, 69 మంది విద్యార్థులు ప్రవేశాలకు అర్హత పొందారని విశ్వం విద్యాసంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో రెండో అత్యుత్తమ మార్కులు సాధించారని, మొత్తం 72 సీట్లు దక్కించుకున్నారని వెల్లడించారు. ఈ ఫలితాల నేపథ్యంలో సైనిక్ స్కూల్స్, రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ఆదివారం తిరుపతిలోని వరదరాజనగర్‌లో విశ్వం సైనిక్-నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడైన విశ్వనాథ్ రెడ్డి ప్రవేశ పరీక్షల అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, ప్రశ్నల సరళి, సన్నద్ధత పద్ధతులను వివరించారు. జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించాలంటే ముందస్తు ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన అధ్యయనం, నిరంతర సాధన అవసరమని పేర్కొన్నారు. గత 37 ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న తమ సంస్థలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో పాటు మాక్ టెస్టుల ద్వారా విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమబద్ధంగా చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచించారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సుకు హాజరై ప్రవేశ పరీక్షలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాబోయే ప్రవేశ పరీక్షలకు ముందస్తు సన్నద్ధత, సరైన మార్గదర్శకత్వం అందించడమే కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## బోధనా రంగంలో ఎస్వీయూ ప్రొఫెసర్‌కు వరుస పురస్కారాలు

**ఐఎస్‌టీఈ అవార్డుకు వెంకటరామయ్య ఎంపిక**

**తిరుపతి విద్య అక్టోబర్ 11 ప్రభాత వార్త**



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ పి. వెంకటరామయ్యకు మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) ఆంధ్రప్రదేశ్ విభాగం ప్రకటించిన ఉత్తమ మెకానికల్ ఇంజినీరింగ్ ఉపాధ్యాయ పురస్కారం-2026కు ఆయన ఎంపికయ్యారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఆయనకు తాజాగా ఐఎస్‌టీఈ అవార్డు దక్కడం విశేషం. సాంకేతిక విద్యా రంగంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ అందించే ఈ పురస్కారాన్ని నవంబర్ 7న విశాఖపట్నంలోని ఎన్ఎస్ఆర్ఐటీలో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ఒకే ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వ పురస్కారంతో పాటు మరో ముఖ్యమైన ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడంతో ఎస్వీయూ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. వెంకటరామయ్య సాధించిన ఈ గుర్తింపుపై ఎస్వీయూ ఉపకులపతి, ఇతర అధికారులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు .

# తిరుపతి డివిజన్

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**కమిషనర్ ఎం.జయకృష్ణ**



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో అక్టోబర్ 12 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## గ్రామీణ క్రీడా ప్రతిభకు పీపీఎల్ వేదిక..!

**- విజేతగా ఇస్కాన్ వారియర్స్.. రన్నరప్‌గా గొల్లపల్లి ఎలెవన్**

**- విజేతలకు బహుమతులు అందజేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి**

**తిరుపతిరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

తుమ్మలగుంట: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో క్రికెట్ టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. తుమ్మలగుంటలోని కేవీఎస్ గ్రౌండ్స్‌లో 20 రోజుల పాటు నిర్వహించిన పేరూరు ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫైనల్‌లో విజయం సాధించిన ఇస్కాన్ వారియర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20,999 నగదు బహుమతి, రన్నరప్ గొల్లపల్లి ఎలెవన్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10,999 నగదు బహుమతిని అందజేశారు. టోర్నీలో సుమారు 70 జట్లు పాల్గొనడం అభినందనీయమని చెవిరెడ్డి పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని విజయానికి తొలి మెట్టుగా భావించి ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు చెంచు మోహన్ యాదవ్‌ను అభినందించారు.

## ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వొద్దు

**- అవిలాలలో పార్టీ కేడర్‌తో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆత్మీయ భేటీ**



**తిరుపతి రూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి వార్డులోనూ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నామినేషన్ల దాఖలుకు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంతో పనిచేస్తూ, పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెవిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అవిలాల పంచాయతీ పరిధిలోని పార్టీ నాయకులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

## కష్ట కాలంలో భరోసానిచ్చిన పుత్తూరు పోలీసు అధికారులు



**పుత్తూరురూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలం నందిమంగళం గ్రామానికి చెందిన ఏ.మురగయ్య భార్య ఏ.మంజుల గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ పూట గడవడం కూడా కష్టమైన నిరుపేద స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పుత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నెట్టి కంటయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబులు వెంటనే స్పందించారు. ఆ నిరుపేద కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పడమే కాకుండా, తక్షణ సహాయంగా బియ్యం బస్తా, ఆర్థిక సహాయాన్ని అందజేసి తమగొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. ఖాకీ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాదు, కష్టంలో ఉన్న వారికి అండగా నిలవడం కూడా అని మరోసారి నిరూపించారు. సమాజంలో ఇలాంటి ఆపద్బాంధవులైన అధికారులు మరింత మంది ముందుకు రావాలని, సీఐ నెట్టి కంటయ్య, ఎస్ఐ నాగేంద్రబాబు భవిష్యత్‌లోనూ ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతోశ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**పుత్తూరురూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు దేవాలయాల్లో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పట్టణంలోని రైల్వేక్వార్టర్స్ సమీపంలోని శ్రీ నాగాలమ్మ దేవాలయం, శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి దేవాలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, గ్రామదేవత ఆరేటమ్మ, ఓంశక్తి, శ్రీ కామాక్షిసమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయాల్లో, అలాగే మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో వెలసిన శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయం, తొరూరు పోలాక్షమ్మ దేవాలయం, నగరి సమీపంలోని కణం మిట్టలో వెలసిన శ్రీ దక్షిణ కాళీ వారాహి అమ్మన్ దేవాలయంలో విశేష పూజలు చేసి అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో అలంకరించారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## శరన్నవరాత్రుల్లో బాల త్రిపురసుందరి అవతారంలో కట్టమిద గంగమ్మ

**చిన్నగొట్టిగల్లు, అక్టోబరు 11 ప్రభాతవార్త:**



శరన్నవరాత్రుల సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలోని కట్టమిద గంగమ్మ అమ్మవారు బాల త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ పుష్పాలు, విశేష అలంకరణలతో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రుల వేళ అమ్మవారి దర్శనంతో ఆలయ పరిసరాలు భక్తిభావంతో నిండిపోయాయి. లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాల కోసం భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.

వార్త | తిరుపతి ,చిత్తూరు జిల్లాలు ◆ సోమవారం 12 అక్టోబర్ 2026



# తిరుపతి డివిజన్

## కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు: ముక్కుపుడక వితరణ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారికి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలసి సారెను అందించారు. ఆదివారం నుంచి ఆలయంలో అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాసనసభ్యుడు అమ్మవారికి సారెతో పాటు ముక్కుపుడకను వితరణగా అందించారు.ఆధ్యాత్మిక చింతనలో మొదటి వరుసలో ఉన్న సుధీర్‌రెడ్డి మొదటి రోజే అమ్మవారి సన్నిధిలో పూజలు జరిపించుకున్నారు.తాను మొక్కుకున్న మేరకు ఆదివారం అమ్మవారికి సారె అందించినట్లు తెలిపారు.వారికి ఆలయ ఇఒ, చైర్మెన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కూటమికి రాబోవు స్థానిక ఎన్నికల్లో తిరుగులేని విజయం ప్రసాదించాలని కోరుకున్నట్లు సమాచారం.ఆయనతో పాటు ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టిగోపినాథ్, కోలా వైశాలి, కౌసలమ్మ,కుసుమకుమారి,లక్ష్మమ్మ, పగడాల మురళి,కె.నాగరాజు, దండి రాఘవయ్య,విజయమ్మ, హైమావతి,ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ఎఇఒ మోహన్,పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కొలా ఆనంద్‌కుమార్ కూడా ఉన్నారు.ఎంఎల్‌ఏ సతీమణి బొజ్జల రిషితారెడ్డి, తల్లి బృందమ్మ, డాక్టర్ గెరటారెడ్డి తదితరులున్నారు.

## బండారుపల్లి గ్రామంలో మినీ గ్రంథాలయం

ఏర్పేడు అక్టోబర్ 11 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని బండారుపల్లిలో చదువుకునే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న గ్రంథాలయం డిమాండ్ కల నెరవేరిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గురువారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రంథాలయాల అభివృద్ధిలో భాగంగా బండారుపల్లిలో మినీ గ్రంథాలయం పుస్తక డిపాజిట్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి పత్రాన్ని జారీ చేశారు. ఈ కేంద్రానికి ఇన్‌చార్జిగా స్థానిక విద్యావేత్త పి. చెంచు కృష్ణారెడ్డిని నియమిస్తూ అనుమతి పత్రాన్ని అందజేశారు. గ్రంథాలయ అధికారులు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ గురువారెడ్డి మాట్లాడుతూ "రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచన విధానం ప్రకారం ప్రతి గ్రామంలో పుస్తక పఠనాన్ని పెంచడమే లక్ష్యం. నగరాలకు వెళ్లి పుస్తకాలు చదవలేని పేద విద్యార్థుల కోసమే ఈ బిడిసి లు" అని అన్నారు. ఈ కేంద్రంలో త్వరలోనే దినపత్రికలు, వారపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఇది బండారుపల్లి చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు గ్రంథాలయాధికారి బిలాల్, బండారుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, రమేష్, మీనా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్లంలో శరవన్నరాత్రి ఉత్సవాలు: కలశ స్తాపన

ఏర్పేడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని పలు దేవాలయాల్లో ఆదివారం దేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ



వైభవంగా కన్నుల పండువగా మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు.ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ది చెందిన గుడిమల్లం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించి కలశ స్థాపన జరిగింది. ఉదయం ఆలయ ఆవరణలో కలశాన్ని,సారెను ఊరేగించారు. ఇటీవల ఆలయంలో కుంబాభిషేకం జరిగిన తరువాత గ్రామం రూపు రేఖలు మారుతున్నాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి బాల త్రిపురాసుందరి దేవి అలంకారం జరిపారు. ఉభయదారులు దినేష్‌రెడ్డి కుటుంబసభ్యులు సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో సమర్పించారు.ఈ కార్యక్రమాల్లో వారితో పాటు సురేష్‌రెడ్డి, ఆలేఖ్య వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు.గ్రామదేవత ఆహ్వానం,గణపతి పూజలు,పుణ్యావాహాచనం, నవగ్రహ మండప ఆరాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఒ మునిశేఖర్ పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది, వేదపండితులు హాజరయ్యారు.

## అనందభైరవి అలంకారంలో దక్షిణ కాళి మాత!

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం దక్షిణ కాళి మాత ఆలయం లో వెలసిన దేవేరికి నవరాత్రి మహోత్సవాల సందర్బంగా ప్రత్యేకాలంకారాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో పాలక మండలి సారధ్యంలో పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లును దొరైరాజు సూచనలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ప్రధాన రోడ్డు నుంచి కన్నులు మిరిమిట్లు గొల్పునట్లు విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేసారు.ఉదయం నుంచి ఆలయానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని భక్తులు రావటంతో ఆలయం వద్ద బిజీగామారింది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భోజన వసతి కల్పించారు.



## ఎన్నికల నేపథ్యంలో

### రౌడీషీటర్లు, అనుమానితులకు కౌన్సెలింగ్

తిరుపతి,అక్టోబర్ 11ప్రభాతవార్త:

రాబోయే ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా పరిరక్షి ంచేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితులు, గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులకు పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం, ప్రలోభాలకు గురిచేయడం, గొడవలు సృష్టించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టంగా సూచించారు. ఎన్నికల సమయంలో హింస, బెదిరింపులు, అల్లర్లు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తెలిపారు.

## లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యనభ్యశించాలి

### వెరిటాస్ సైనిక పాఠశాల చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి



రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

లక్ష్యాలను నిర్ధేశించుకుని విద్యార్థులు విద్యనభ్యశించాలని సి.రామాపురలోని వెరిటాస్ సైనిక పాఠశాల వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి అన్నారు. ఆదివారం వెరిటాస్ సైనిక పాఠశాలలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే మొదటి ప్రైవేటు సైనిక పాఠశాల సి.రామాపురంలో నెలకొల్పామన్నారు. పాఠశాలలో విద్యనభ్యశించే 78 మంది విద్యార్థులలో యుపిఎస్‌సి నిర్వహించిన ఎన్‌డిఏ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే 11 మంది ఎంపిక కావడంతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. వీరికి త్రివిధ దళాలలో అధికారులుగా పనిచేసే అధికారం కలుగుతుందన్నారు. విద్యా ప్రావీణ్యం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సైనిక విలువలతో కూడిన విద్యను వెరిటాస్ అందిస్తుందన్నారు. ఎడిఏ పరీక్షల్లో విజయాన్ని సాధించిన క్యాడెట్లను, పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బి.శ్రీకర్ రెడ్డి, బి.సందీప్ రెడ్డి, డీన్ ఎయిర్ కమాండర్ సిజెహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ పిఆర్‌ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## సురభి గోసంరక్షణశాలలో వైభవోపేతంగా నవరాత్రి ఉత్సవాలు

రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:



సూరావారి పల్లి సమీపంలోని సురభి గోసంరక్షణశాలలో ఆదివారం దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో గోశాలను విద్యుత్ దీపాలు, చలువ పందిళ్ళతో అందంగా అలంకరించారు. అమ్మవారికి సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలు, ఆభరణాలతో వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గోశాల ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## ప్రాణయోగా ఆశ్రమంలో వరుణయాగం



రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

కొత్తకండ్రిగ సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో ఆదివారం వరుణ యాగాన్ని ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి ఆశీస్సులతో ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాష్ గురూజీ ఆధ్వర్యంలో వేదపండితులు వేదమంత్రోచ్చారణలను జపిస్తూ సహస్ర ఘట్టాభిషేకాన్ని, వరుణ మంత్ర జపాలు చేశారు. కారిష్టి హోమం, నిత్యాగ్నిహోత్రులు, శ్రౌతహోమంలో భాగంగా మొదటి రోజు అగ్నిమధనము వలన అగ్నిదేవుని ఆవాహనం జరిగింది. అశ్వము, నల్ల గొర్రెను మంత్ర జలంతో ప్రోక్షణ గావించి యాగానికి అంకురార్పణ చేశారు. నల్లకర్జూరం, నల్లతేనె కలిపి పధార్ధములను దేవేతలకు నివేధించడం జరిగింది. చంద్రమౌళేశ్వర పూజ నిర్వహించి, మహాభారతంలోని విరాట పర్వాన్ని పారాయణం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో వరుణ యాగంలో పాల్గొన్నారు.

## అకట్టుకున్న బొమ్మల కొలువు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా సంబరాలు ప్రారంభమయ్యాయి.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో మూల విరాట్టు జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయం ఎదుట భక్తుల్ని ఆకట్టుకునే రీతిలోబొమ్మల కొలువును ఏర్పాటు చేసారు. ఇక్కడ ప్రతి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఒక్కొక్క అలంకారం నిర్వహిస్తారు. ఆదివారం దసరా సంబరాలు ప్రారంభోత్సవం సందర్భంగా అమ్మవారికి బాల త్రిపురాసుందరి దేవి అలంకారం నిర్వహించారు. కాగా ఆలయ మిరాసి దారులు,అర్చకుల ఇళ్ళలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటున్నాయి.కాగా ఆలయ ప్రధాన మిరాసి దారు ఎస్ఎంకె బాబు గురుకుల్ ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో సుమారు 500 బొమ్మలను ఏర్పాటు చేసారు. ఉదయం ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాదన్, శ్రీకాళహస్తీశ్వర గురుకుల్,ఎస్ఎంకె పరశురాం గురుకుల్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.బొమ్మల కొలువుకు మహిళలను ఆహ్వానించి వారికి సారె అందించారు.

## ఘనంగా వాసవీ అమ్మవారి దసరా ఉత్సవాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త




పట్టణంలోని బజారువీధి, ఉప్పువీధిలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆదివారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. అనంతరం గణపతి పూజ, స్వస్తివాచనం నిర్వహించారు. బజారు వీధిలోని ఆలయంలో కమిటీ అధ్యక్షులు జూలుగంటి మురళీకృష్ణ సాధర్యంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం సంప్రదాయ బద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉభయదారులు పొట్టి భాస్కర్ గుప్తా, పొట్టి హరీష్‌లు వెంటరాగా సభ్యులతో కలసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉప్పువీధిలోని ఆలయంలో ఉభయదారులు అమ్మవారికి సాంగ్యం తీసుకువచ్చారు. అయితా సాయిబాబా, అయితా చిరంజీవి అయితా శ్రీనివాసులు కుటుంబసభ్యులు అమ్మవారి పూజలకు శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలను తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ శిఖరంపై జెండాను ఆవిష్కరించారు. రోజుకొక్క అలంకరణలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలిరోజు ఉప్పువీధిలోని అమ్మవారు బాల వసవీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రెండు ఆలయాల్లో వాసవీ ఆర్యవైశ్య సమాజం కమిటీ,మహిళా, యువజనసేవా సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన వారికి ఉచితంగా ప్రసాదాలను పంపిణీచేశారు.

## జాతీయ వేదికపై తిరుపతి అథ్లెట్ల పతకాల వేట

### వెటరన్స్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులకు నాలుగు పతకాలు



తిరుపతి విద్య అక్టోబర్ 11 ప్రభాత వార్త

వయసు పెరుగుతున్నా క్రీడా ఉత్సాహం తగ్గదని తిరుపతి జిల్లా అథ్లెట్లు నిరూపించారు. కోయంబత్తూరులో అక్టోబర్ 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన ఐదో జాతీయ వెటరన్స్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. వీరిలో విద్యుత్ శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నరిసేటి నరేంద్ర నాయుడు రెండు రజత పతకాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. 50 ఏళ్ల విభాగంలో 10 వేల మీటర్ల పరుగు పందెం, ఐదు కిలోమీటర్ల నడకలో ఆయన రజత పతకాలు కైవసం చేసుకున్నారు.విద్యుత్ శాఖకే చెందిన బాలసుబ్రమణ్యం, యుగంధర్ 40 ఏళ్ల విభాగంలో ఐదు కిలోమీటర్ల నడకలో వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. దీంతో ఈ పోటీల్లో తిరుపతి జిల్లా క్రీడాకారుల ఖాతాలో రెండు రజతాలు, ఒక కాంస్యంతో పాటు మొత్తం నాలుగు పతకాలు నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పాకనాటి హరికృష్ణ ఆధ్వర్యంలో, తణుకులో జరిగిన 44వ అంతర్ జిల్లాల క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతోపాటు వైల్డ్‌కార్డు ప్రవేశం ద్వారా నరేంద్ర నాయుడు జాతీయ పోటీల్లో పాల్గొన్నారు.ఈ పోటీల్లో విద్యుత్ శాఖకు చెందిన సీజీఎం మద్దెన శ్రీకాంత్, ఎస్ఏఓ బొట్లపాటి నాగేశ్వరరావు, బలమూరు బాలాజీ, డా. కిశోర్ తదితరులు పాల్గొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తిరుపతి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పాకనాటి హరికృష్ణ, కార్యదర్శి రామచంద్రయ్యతోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, క్రీడాభిమానులు అభినందించారు.

## వైభవంగా "శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి" నవరాత్రి ఉత్సవాలు

### పీఠాధిపతి సూరి స్వామి

చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:




తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరం వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠాధిపతి సూరీ స్వామి తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట, అంకురార్పణం గావించారు. తదుపరి 9 గంటల నుండి 12 గంటల వరకు గణపతి హోమం, శైలపుత్రి హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలతో దేధీప్యమానంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## పాతికేళ్ళ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఐదు గ్రామాలకు అనుసంధానం 3.5 కి.మీ బిటి రోడ్డు
### మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా



చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

పాతికేళ్ళ రోడ్డు సమస్యకు ఎంఎల్‌ఏ పులివర్తి నాని శాశ్వత పరిష్కారం చూపినట్లు మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా తెలిపారు. మండల పరిధిలోని పిచ్చినాయుడు పల్లి పంచాయతీ, గొల్లవానికాల్వ వద్ద బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే నుండి మఠంపల్లి, పిచ్చినాయుడు పల్లి, హరిజనవాడ, అరుందతీ వాడ, గొల్లవానికాల్వ వెళ్ళే ప్రజలకు గతుకుల మయమైన రోడ్డుతో పడుతున్న ఇబ్బందులకు చెక్ పెడుతూ ఎంఎల్‌ఏ రూ.1.27 కోట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. దీంతో 3.5 కిలో మీటర్లు బిటి రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. తమ గ్రామాలకు బిటి రోడ్డు మంజూరు చేయించిన ఎంఎల్‌ఏకి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. డిఈ ప్రభాకర్ రెడ్డి, ఏఈ చెన్నయ్య, టిడిపి యూనిట్ ఇన్‌చార్జ్ శానంబట్ల తులసి రెడ్డి, పిచ్చినాయుడు పల్లి ఇన్‌చార్జ్ కె.హరి, గ్రామకమిటీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీవారి నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

### చంద్రగిరి ఎస్‌డిపిఓ జగదీష్ నాయక్



చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రగిరి ఎస్‌డిపిఓ జగదీష్ నాయక్ తెలిపారు. శ్రీనివాస మంగాపురం సమీపంలో బిఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం బ్రహ్మోవాల బందోబస్తుకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పరిసరాలు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. భక్తులతో మర్యాపూర్వకంగా మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించి, భక్తుల భద్రతకు దోహపడాలన్నారు. ఈ సమావేశంలోసిఐసురేష్‌కుమార్,ఎస్ఐలుఅరుణాచలం,అరుణ,పోలీసుఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సంతోషిమాతా శరన్నవరాత్రి ఉత్సవాలకు కలశస్థాపన

చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:



పుట్టాలమ్మ ఆలయ ఆవరణలోని శ్రీ సంతోషిమాతా అమ్మవారి శరన్నవ రాత్రి మహోత్సవాలకు ఆవరణలో ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన గావించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి గణపతి పూజ, యమునా పూజ, కలశ స్థాపన గావించారు.ఉభయదారులు ఎం.వెంకటరమణ రెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు ఆర్.శంకర్ రెడ్డి, ఆలయ నిర్మాణ దాత యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పి.ఈశ్వరాచారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

12 CTR 6:12 CTR 6.qxd 10/11/2026 11:48 PM Page 1



# అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రేణిగుంట, అక్టోబర్ 11, ప్రభాతవార్త:
మద్యానికి బానిసై, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రేణిగుంట మండలం తారకరామ నగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనపై రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా... తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన పెయ్యాల గోవర్ధన్, సుబ్బలక్ష్మి ్మ దంపతుల పెద్ద కుమారుడు పెయ్యాల బద్రి (26). ఆరేళ్ల క్రితం కావమ్మతో వివాహమైన బద్రికి లోకేష్ వర్ధన్ (3) అనే కుమారుడు ఉన్నాడు. కుటుంబంతో కలిసి కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్‌లో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై, సరిగా ఆటో నడపకుండా అప్పులు చేశాడు.అక్టోబర్ నెల 9న భార్య కావమ్మ తన చెల్లెలి ఇంటికి వెళ్లడంతో బద్రి ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. 10వ తేదీ సాయంత్రం భార్యతో ఫోన్‌లో మాట్లాడిన అతను, ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఎదురింట్లో నివసించే మురళికి సమాచారం ఇచ్చారు. అతను వెళ్లి చూడగా, ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని బద్రి మృతిచెంది ఉన్నాడు.మద్యానికి బానిసై, అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి సుబ్బలక్ష్మి ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, అనుమానితులకు కౌన్సెలింగ్

తిరుపతి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:
రాబోయే ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా పరిరక్షి ంచేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితులు, గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులకు పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం, ప్రలోభాలకు గురిచేయడం, గొడవలు సృష్టించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టంగా సూచించారు. ఎన్నికల సమయంలో హింస, బెదిరింపులు, అల్లర్లు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా.. ప్రాణరక్షణకు చిరునామా.. స్విమ్స్ వైద్యసేవలు

**- ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో రాష్ట్రస్థాయిలో స్విమ్స్ విశేష ప్రగతి**
**- సెప్టెంబర్ నెలలో 2,450 మంది రోగులకు వైద్యచికిత్సలు - సంచాలకులు, ఉపకులపతి, స్విమ్స్ డాక్టర్ గుడారు జగదీష్**



తిరుపతి హెల్త్, అక్టోబర్ 11 ప్రభాతవార్త
అత్యాధునిక వైద్య సదుపాయాలు.. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు.. మానవతా దృక్పథంతో నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, డబ్బుల్లేక ఏ పేద రోగి ప్రాణరక్షక వైద్యానికి దూరం కాకూడదు.. స్విమ్స్‌కు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన చికిత్సతో పాటు నమ్మకం, ధైర్యం, భరోసా కల్పించడమే మా లక్ష్యమని సంచాలకులు, ఉపకులపతి, స్విమ్స్ డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు. వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చే ప్రతి రోగి తనకు అత్యుత్తమ చికిత్స అందుతుందనే నమ్మకంతో రావాలి. చికిత్స అనంతరం ఆరోగ్యంతో, సంతృప్తితో, మనసునిండా భరోసాతో ఇంటికి తిరిగి వెళ్లాలి. అదే స్విమ్స్ వైద్యసేవల అసలైన లక్ష్యం అని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రతిష్ఠాత్మక స్విమ్స్ వైద్య సంస్థ, పేద, మధ్య తరగతి కుటుంబాలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో విశేష కృషి చేస్తోందని ఆయన తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో స్విమ్స్ రాష్ట్ర స్థాయిలో విశేష ప్రగతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, ఈ విజయానికి కృషి చేసిన వైద్యులు, ఎన్టీఆర్ వైద్యసేవ విభాగం అధికారులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, పరిపాలనా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. స్విమ్స్ అంటే కేవలం ఒక ఆసుపత్రి కాదు. ఆర్థికంగా వెనుకబడిన వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించే సేవా సంస్థ. రోగి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు అతని కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవడం కూడా మా బాధ్యత అని డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు.

**సెప్టెంబర్ నెలలో విశేష వైద్యసేవలు - వేలాది మంది రోగులకు ఆరోగ్య భరోసా**

2026 సెప్టెంబర్ నెలలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా స్విమ్స్‌లో 2,450 మంది రోగులకు వివిధ రకాల వైద్యచికిత్సలు అందించడం సంస్థ వైద్యసేవల విస్తృతికి నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ నెలలో వివిధ ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద వేల సంఖ్యలో క్లెయిమ్‌లు నమోదు కావడం, పెద్ద మొత్తంలో వైద్య చికిత్సలు అందించడం, పేద రోగులకు చికిత్సా వ్యయాల్లో రాయితీలు కల్పించడం స్విమ్స్ సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి రోగికి అందుబాటులోకి తీసుకురావడానికి, క్లెయిమ్‌ల నమోదు నుంచి ఆమోదం వరకు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ఎన్నికల ఏర్పాట్లపై డీఎస్పీ పావని సమీక్ష..

**పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన..**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావని ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. శ్రీకాళహస్తిలోని అగ్రహారం, వి.ఎం. పల్లి ఏరియాల్లో ఆమె పర్యటించి ఎన్నికల ఏర్పాట్లపై స్థానిక సిఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, మౌళిక సదుపాయాలు, గా లి,వెలుతురు,మంచినీటి సదుపాయాలు, సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..**

ఎన్నికల నేపథ్యంలో గతంలో ఎక్కడ సమస్యలు చోటు చేసుకున్నాయో వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు, క్యూ లైన్ల ఏర్పాటుపై కూడా ఆమె సమీక్షించారు. డీఎస్పీ వెంట సిఐలు వెంకటేష్,నాగరాజు, ఇబ్రహీం, లక్ష్మీనారాయణ,ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాకాలలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

**స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కేడర్‌కు దిశానిర్దేశం**



పాకాల, అక్టోబర్ 11 ప్రభాతవార్త
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడమే లక్ష్యంగా పాకాల మండలంలో ఆదివారం రోజున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నంగా నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పాకాల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశానికి చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, అలా నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ స్థాయిలో పార్టీ పట్టు కోల్పోయే ప్రమాదం ఉందని కేడర్‌ను అప్రమత్తం చేశారు. వర్గ విభేదాలు వీడి ఐక్యతతో పోరాడాలని పార్టీ శ్రేణులు అంతర్గత విభేదాలు పక్కనబెట్టి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పరస్పర విభేదాలతో ముందుకు సాగితే ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవని స్పష్టం చేస్తూ, బలమైన నాయకత్వం నిలబడాలంటే పంచాయతీలపై పట్టు సాధించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికలకు పునాది అని స్థానిక ఎన్నికల్లో సాధించే విజయాలే రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపును సులభతరం చేస్తాయని, అందుకే ప్రతి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్లకు సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.సమావేశం అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి భోజనం చేస్తూ, క్షేత్రస్థాయి కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమై వారిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.

## ప్రజాస్వామ్య దేశంలో ఓటు అందరికీ ప్రాథమిక హక్కు




**రేణిగుంట, అక్టోబరు 11 ప్రభాతవార్త:**
ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఓటు హక్కు పరిరక్షణ అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఢిల్లీలో నిరసన తెలుపుతున్న యువత, వామపక్ష విద్యార్థి నేతలపై పోలీసుల చర్యలను ఖండిస్తూ ఆదివారం రేణిగుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం(వామపక్ష) నాయకులు ధర్నా నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయంటూ వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు తొలగించిన పేర్లపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించాలని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్టోబరు 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలో యువత, వామపక్ష విద్యార్థి నాయకులు శాంతియుతంగా ఆందోళన చేపట్టగా, పోలీసులు లాఠీచార్జి చేసి పలువురు నేతలను నిర్బంధించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ఆందోళనకారులపై తీసుకున్న చర్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమిస్తామని తెలిపారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న యువత, విద్యార్థి సంఘాల నాయకులకు ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా అంశంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి వై.ఎస్. మణి, మురళి, రజాక్, రమణ, అమ్ములు, దాము, గిరి, వరలక్షి ్మ, సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, వెంకటరమణ, శివానందం, ఈశ్వరమ్మ, సత్యశ్రీ, సెల్వరాజ్, దిలీప్ భాషా, మునిస్వామి, దస్తగిరి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**- అధ్యక్షుడిగా కోటగిరి శ్రీధర్, జనరల్ సెక్రటరీగా ఎం. డేనియల్ ప్రదీప్**




తిరుపతి హెల్త్, అక్టోబర్ 11, ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం ఈస్ట్ ఎడవల్లిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. గత నెల 14న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జరిగిన ఈ ఎన్నికల్లో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. శ్యామ్ ప్రసాద్ ఫలితాలను ప్రకటించారు. అధ్యక్షుడిగా కోటగిరి శ్రీధర్, ఉపాధ్యక్షులుగా టంగుటూరు రాధికా రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుత్తికొండ వంశీ కిరణ్, ఉపాధ్యక్షులుగా జె.వి. అనిల్ కుమార్, కోశాధికారిగా ఏలేశ్వరపు నీలాద్రి వెంకట కుమార్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా కె. క్రాంతి కుమార్, జి.ఎస్.ఎస్. పవన్ కుమార్, ఎం. అచ్యుతాంబ, జి. సరిత, ఎం.వి.ఎస్. సాయి కుమార్, బాపనపల్లి ఉమా శంకర్, ఎ. రెడ్డప్ప, ఎం. అంజలీ దేవి, బి. చక్రవర్తి, డి.మౌనిక ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ తరఫున స్వేన్ హరేంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ తరఫున బడేటి వెంకట్రామయ్య పరిశీలకులుగా హాజరయ్యారు. ఎన్నికల అనంతరం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఎం. డేనియల్ ప్రదీప్‌ను జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నారు.

## కర్ణాటక ఛౌల్ట్రీని టీటీడీ వెంటనే స్వాధీనం చేసుకోవాలి

**- తిరుమల తిరుపతి పరిరక్షణ కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ డిమాండ్**

తిరుపతి హెల్త్, అక్టోబర్ 11, ప్రభాతవార్త




తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తుల సేవ కోసం కేటాయించిన స్థలంలో వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్న కర్ణాటక ఛౌల్ట్రీని టీటీడీ వెంటనే తన స్వాధీనంలోకి తీసుకోవాలని తిరుమల తిరుపతి పరిరక్షణ కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వ చర్యలు టీటీడీ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా కుప్పాల గిరిధర్ కుమార్ మాట్లాడుతూ లాభాపేక్ష లేని స్థలంలో వ్యాపారాలు తిరుమలలోని 6 ఎకరాల 47 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న కర్ణాటక ఛౌల్ట్రీ భక్తులకు ఉచిత లేదా స్వల్ప రుసుముతో సేవలు అందించడానికి ఉద్దేశించినది. కానీ, ఇటీవల కర్ణాటక క్యాబినెట్ సమావేశంలో అక్కడున్న గదులు, హోటళ్ల ప్రైవేట్ టెండర్ల ద్వారా వచ్చే లాభాలను కర్ణాటక ప్రభుత్వం, టూరిజం శాఖ 50-50 పంచుకోవాలని నిర్ణయించడం, ఆస్తులనుకి 30 ఏళ్ల లీజుకు ఇస్తూ జీవో విడుదల చేయడం ఆక్షేపణీయమన్నారు. అక్కడ ఉన్న 364 గదులు, 12 డార్మిటరీలను అధిక అద్దెలకు ఇస్తూ భక్తుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ టెండర్లను రద్దు చేసి, అక్కడ ఉన్న సదుపాయాలను పేద భక్తుల అన్నదానానికి, వసతికే ఉపయోగించాలి. కర్ణాటక ఛౌల్ట్రీలో ఉన్న కల్యాణ మండపానికి ఏకంగా రూ. 5 లక్షల వరకు అద్దె నిర్ణయించి, తిరుమలలో వివాహం చేసుకోవాలని వచ్చే భక్తుల నుంచి భారీగా వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. టీటీడీకి చెల్లించాల్సిన చదరపు అడుగుకు సంవత్సరానికి కేవలం 2.30 పైసల లీజు రుసుమును కూడా కర్ణాటక ప్రభుత్వం చెల్లించడం లేదని, బకాయిలను టీటీడీ తక్షణమే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రతను కాపాడుతూ, భక్తుల దోపిడీని వెంటనే అరికట్టడానికి టీటీడీ యాజమాన్యం చొరవ తీసుకుని కర్ణాటక ఛౌల్ట్రీని స్వాధీనం చేసుకోవాలని ఈ సందర్భంగా కుప్పాల గిరిధర్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో ప్రతినిధులు మునీశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, నీలాద్రి, రమేష్ నాయుడు, టీవీ రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న సహచరుడికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

*పాకాల, అక్టోబరు 11 ప్రభాతవార్త:*



దశాబ్దాలు గడిచినా బాల్య స్నేహం చెక్కుచెదరలేదని, ఆపదలో ఉన్న స్నేహితుడికి తామున్నామంటూ భరోసానిచ్చి నిరూపించారు కొందరు పూర్వ విద్యార్థులు. పాకాల మండలంలోని దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లికి చెందిన టి. రామకృష్ణ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పూర్వ సహచరులు చలించిపోయారు. 198384 విద్యా సంవత్సరంలో రామకృష్ణతో కలిసి 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు డి. గోపి, ఎస్. చంద్రశేఖర్, గంధం వెంకటముని, రఫీ తదితరులు ఆదివారం ఆయనను కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పడమే కాకుండా, వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతుగా సేకరించిన ఆర్థిక సాయాన్ని రామకృష్ణకు అందజేశారు. కష్టకాలంలో చేదోడువాదోడుగా నిలిచి మానవత్వం చాటుకున్న మిత్రుల ఔదార్యాన్ని స్థానికులు, బంధువులు అభినందించారు.

## అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానంతో స్విమ్స్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు

**- స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీశ్**

తిరుపతి హెల్త్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:
శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), ఈఎన్టీ విభాగం ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డా. ఎస్.బి. అమర్నాథ్ మలేషియాలోని కౌలాలంపూర్లో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4, 2026 వరకు నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం - 2026లో విజయవంతంగా పాల్గొని అధునాతన కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స పద్ధతులపై శిక్షణ పూర్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చిన్నారులకు తక్కువ వయస్సులోనే కాక్లియర్ ఇంప్లాంటేషన్, రెండు చెవులకు ఇంప్లాంటేషన్, అధునాతన ఎలక్ట్రోడ్ సాంకేతికత, స్మార్ట్నావ్ సాయంతో శస్త్రచికిత్స నిర్వహణ, అంతఃకర్ణ నిర్మాణలోపాలున్న రోగులకు అనుసరించాల్సిన ప్రత్యేక శస్త్రచికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా తీవ్రమైన వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులు, పెద్దలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన ఆధునిక పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాన్ని ఆయన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీశ్ డా. ఎస్.బి. అమర్నాథ్‌ను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో అధునాతన వైద్య శిక్షణ పొందడం స్విమ్స్ వైద్యసేవల అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. డా. గుడారు జగదీశ్ మాట్లాడుతూ ˝ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్విమ్స్ లోని వైద్యసేవలకు అనుసంధానం చేయడం మా ప్రాధాన్యత. వైద్యులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, అంతర్జాతీయ స్థాయి శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు వినియోగించాలి. డా. ఎస్.బి. అమర్నాథ్ ఈ దిశగా చేసిన కృషి అభినందనీయం. ముఖ్యంగా వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు సరైన సమయంలో ఆధునిక చికిత్స అందించడం ద్వారా వారి భాషాభివృద్ధి, విద్యాభ్యాసం, సామాజిక జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అవకాశం ఉంటుంది.˝ ఈ సందర్భంగా డా. ఎస్.బి. అమర్నాథ్ మాట్లాడుతూ అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం, సహకారం అందించిన స్విమ్స్ డైరెక్టర్ డా. గుడారు జగదీశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పొందిన ఆధునిక పరిజ్ఞానం, శస్త్రచికిత్స నైపుణ్యాలు స్విమ్స్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సేవల ప్రారంభానికి, వినికిడి లోపంతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## బాల త్రిపురసుందరిగా శ్రీ భద్రకాళి అమ్మవారు



చిట్వేలి, అక్టోబర్ 11 ప్రభాతవార్త :
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చిట్వేలి నందు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యా యి. ఇందులో భాగంగా పాత చిట్వేలి నందు వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సోమేశ్వర స్వామి సమేత శ్రీ శ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా అత్యంత వైభవంగా తొమ్మిది రోజులు పాటు ప్రతిరోజు ప్రత్యేక అలంకారంలో భక్తులను కటాక్షి ంచే శ్రీ వాసవి మాత మొదటి రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి గా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి రూపాలను దర్శించుకున్నారు. ఆల య అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయపెద్దలు

# సత్యవేడులో కంకర టిప్పర్లతో ట్రాఫిక్ సమస్య

## గాంధీ సాక్షిగా పోలీసులే రైట్ రైట్

సత్యవేడు, అక్టోబర్ 11, ప్రభాతవార్త
పట్టణం మీదుగా కంకర, మట్టి టిప్పర్లతో పాటు భారీ వాహనాల రాకపోకలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో పట్నంలోకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.సత్యవేడు పోలీసులు మాత్రం ఈ అక్రమ కంకర లారీలు, ఇసుక ,మట్టి, దందా దారులతో దుకాణదారులకు, వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు సత్యవేడు సర్కిల్ పరిధిలోని సత్యవేడు మండలంలో కంకర, మట్టి తరలించే టిప్పర్ల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రధాన కూడళ్లు,గాంధీ విగ్రహం వరద్ద గాంధీ సాక్షి గా పోలీసులు ఈ అక్రమ రవాణా వాహనాలకు సెల్యూట్ కొట్టిమరి తమిళనాడుకు పంపుతున్నారు. ఈ రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. పాలగుంట సమీపంలో భారీ వాహనాలు బారులు తీరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, వ్యాపార కార్యకలాపాలపైనా ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యవేడు పట్టణంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే భారీ వాహనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కంకర, మట్టి



తరలించే వాహనాల విషయంలో ఓవర్‌లోడింగ్, అనుమతులు, పన్నుల చెల్లింపులు, రవాణా నిబంధనల అమలుపై రవాణా, మైనింగ్, సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారీ టిప్పర్ల రాకపోకల వల్ల దుమ్ము, ధూళితో పాటు రోడ్డు ప్రమాదాల భయం కూడా నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు రహదారులపై ప్రయాణించే సమయంలో తగిన భద్రత కల్పించాలని కోరుతున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సత్యవేడులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంతో పాటు, అదనపు సిబ్బందిని కేటాయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా అక్రమ రవాణాను అరికట్టడం, ప్రజలకు సురక్షి తమైన రహదారి ప్రయాణాన్ని కల్పించడం సంబంధిత శాఖల బాధ్యత అని పేర్కొంటున్నారు.